నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 25 మే 2025 | ADILABAD NIRMAL



● నిండా ముంచిన అకాల వర్షం

మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతూ కొనుగోలు చేయకపోతే ఆందోళన చేస్తామంటున్న కామోల్ రైతులు

# మొలకెత్తిన ధాన్యం

## వడ్లు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతన్న అష్టకష్టాలు

- రెక్కల కష్టం వర్షం పాలవుతుందని కన్నీరు మున్నీరు
- మూడు వారాలుగా కేంద్రాల్లోనే ధాన్యం
- భార్యాపిల్లలతో జాగారం చేస్తున్నామని ఆవేదన
- ఇక ఎప్పుడు వానకాలం పనులకు సిద్ధం కావాలని ప్రశ్నిస్తున్న అన్నదాతలు
- అధికార యంత్రాంగం, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం

### ఎవరు పట్టించుకోవడం లేదు..



వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో కల్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. తేమ శాతం పేరిట క్వింటాలు ధాన్యానికి అధికారులు ఏడు నుంచి పది కిలోలు వరకు కోత విధించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తరలించాలని వేడుకుంటున్న ఎవరు పట్టించుకోవడం లేదు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

- రాజారెడ్డి, రైతు, కామోల్

### ఇంకెప్పుడు కొంటరు..



కామోల్ గ్రామానికి చెందిన విఠల్ 100 క్వింటాళ్ల ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి గత వారం రోజుల క్రితం తీసుకొచ్చా. అప్పటి నుంచి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. మబ్బులు పడ్డ సమయంలో ధాన్యం బస్తాలపై కవర్లను కప్పి కాపలా ఉంటున్నాం. నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేసి ఇబ్బందులను తీర్చాలి.

- విఠల్, రైతు కామోల్



కుంసరలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు





మొలకెత్తిన ధాన్యంతో బాధపడుతున్న మహిళ రైతు



భైంసా టౌన్, మే 24 : ''మూడు వారాలుగా కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటున్నాం. భార్యాపిల్లలతో రాత్రీపగలు అనే తేడా లేకుండా జాగారం చేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుతో కొనుగోళ్లతో జాప్యం అవుతున్నది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం మొలకెత్తింది. మా రెక్కల కష్టం నీటి పాలవుతుంది..'' అని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కామోల్, కుంసర, వానల్‌పాడ్ గ్రామాల రైతులు మాట్లాడుతూ.. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇంటింటికీ తిరిగి ఓట్లు అడగడానికి వచ్చే నాయకులు.. ఇప్పుడు రైతులు కష్టాల్లో ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. క్వింటాలుకు 7 నుంచి 10 కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నా.. ప్రజాప్రతినిధులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని పేర్కొంటున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కొనుగోలు కేంద్రాల్లోనే గడపడంతో ఖరీఫ్ పనులకు సన్నద్ధం కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్యాపిల్లలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టడం, వర్షం వస్తే కవర్లు కప్పడంతోనే కాలం గడిచిపోతున్నదని అంటున్నారు. కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

### నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు

భైంసా మండల వ్యాప్తంగా మూడు వేల ఎకరాల్లో దొడ్డురకం సాగు చేయగా.. దిగుబడి 62 వేల క్వింటాళ్లు వచ్చిందని, 1000 ఎకరాల్లో సన్నరకం సాగు చేయగా.. 18 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఐకేపీ ఆధ్వర్యంలో 12, పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద 368 మంది రైతులు దొడ్డురకం 15,494 క్వింటాళ్లు రాగా.. 5,069 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. 120 మంది రైతులు సన్నరకం 5,907 కొనుగోలు కేంద్రాలకు చేరగా.. 3,761 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టారు.



కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తున్న ధాన్యం




మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న కుంసర రైతు

---



బజార్‌హత్నూర్ మండలంలోని కొల్లారి వంతెన వద్ద రోడ్డు దుస్థితి



ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర వంతెన దుస్థితి



బేల మండలంలోని దహెగాం రోడ్డు



భీంపూర్ మండలంలోని గుబిడి-టెక్డీ రాంపూర్ రోడ్డు

# నడిస్తే నరకమే..

## ఆదిలాబాద్ జిల్లాలో రహదారులు అస్తవ్యస్తం

- నిలిచిన పనులు.. నిర్వహణ కరువు..
- వర్షాకాలంలో అడుగుతీసి అడుగేయలేం..
- మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రయాణికులు



కొల్లారి వంతెన వద్ద రోడ్డు దుస్థితి

ఆదిలాబాద్, మే 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దుస్థితి అధ్వానంగా మారింది. పల్లె ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం, వంతెనల పనులు కొనసాగుతున్నాయి. వందల కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి ప్రభుత్వం రోడ్లను నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చింది. ప్రస్తుతం ఆ రహదారుల నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా రహదారులు రోజు, రోజుకు పాడవుతున్నాయి. పలు గ్రామాల ప్రజలు రహదారులపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు చిత్తడిగా మారాయి. చిన్నపాటి వర్షాలకే రహదారుల పరిస్థితి అధ్వానంగా మారితే వర్షకాలంలో మరిన్ని ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.

### వర్షకాలంలో నరకం

పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభంకానుండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకున్నది. వర్షకాలంలో రైతులు వ్యవసాయం పనుల కోసం రోజు మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు, ఇతర పనుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వస్తారు. విద్యార్థులు రోజు పాఠశాల, కళాశాలలకు బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణం చేస్తారు. ఆయా గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలు, రేషన్ సరుకులు పలు పనుల కోసం జిల్లా కేంద్రానికి వస్తారు. రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు తప్పేటట్లు లేవు. నిర్వహణ ఖర్చులు రాక రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కారణంగా పనులు జరగలేదని అధికారులు అంటున్నారు.

### ఐదు నెలలుగా నిలిచిన పనులు

బేల మండల కేంద్రం నుంచి పలు గ్రామాల ప్రజలు వర్షకాలంలో సాఫీగా రాకపోకలు సాగించడానికి బేల, మణియర్‌పూర్ మధ్యలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వంతెన ఇది. రూ.7.20 కోట్లతో నిర్మించి ఈ వంతెన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలోపు పనులు పూర్తి కావాల్సి ఉండగా.. పిల్లర్ల వరకు పనులు పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపివేశాడు. పనులు నిలిచి ఐదె నెలలు కావస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల అంటున్నారు. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభకానుండడంతో ఈ రహదారి మీదుగా ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. వంతెన నిర్మాణంలో భాగంగా రోడ్డును తవ్వి కింది నుంచి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం వస్తే మండలంలోని బెదోడ, గూడ, కాంగార్‌పూర్, మణియర్‌పూర్, దహెగాం, సాంగిడి గ్రామాలు రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు బ్రిడ్జి నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వేసి ఇప్పుడు దారిలేకుండా చేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



---

# ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

- రూ.7 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సర్వేయర్
- సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

కడెం, మే 24 : ఓ రైతు వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఓ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా కడెం మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన రైతు గుగ్లవత్ ప్రభాకర్ తన తండ్రి మరణానంతరం ఐదెకరాల పట్టా మార్పిడిలో భాగంగా కొలతల ప్రొసీడింగ్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీని కోసం కడెం మండల సర్వేయర్ ఉమాజీని కలువగా ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.25 వేల వరకు డిమాండ్ చేసి, చివరకు రూ.20 వేలతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో నుంచి రూ.12 వేలను గత నెల 28న ఇవ్వగా, మరో రూ.8 వేల కోసం నిత్యం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ప్రభాకర్ ఏసీబీని ఆశ్రయించాడు. శనివారం రూ.7 వేలను సర్వేయర్‌కు ఇస్తుండగా పట్టుకున్నట్లు తెలిపాడు. నిందితుడు సర్వేయర్‌ని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్ పవర్ ఉమాజీ

# ప్రజా శ్రేయస్సు కోసం కలిసి పని చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- గిరిజనేతర రైతులను ఇబ్బందులు పెట్టొద్దు
- అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతించాలి

నేరడిగొండ, మే 24 : ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులతో పాటు అధికార యంత్రాంగం ప్రజాశ్రేయస్సు కోరి అందరం కలిసి పనిచేయాల్సిన అవసరముందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారులు, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఆటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీసీఎఫ్‌లు, డీఎఫ్‌వోలతో హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బోథ్ నియోజకవర్గం అంటేనే ఆదివాసీల నియోజకవర్గమని, ఇందులో చాలా గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఆ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైతే అటవీశాఖ అనుమతులు లేక నిలిచిపోయాయని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం రోడ్ల నిర్మాణానికి నిధులు వెచ్చిస్తుంటే, మరో వైపు అటవీశాఖ అనుమతులతో అభివృద్ధి పనులు నిలిచిపోవడం సరికాదని, ఈ విషయమై గతంలో అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడం జరిగిందన్నారు. అదే విధంగా బోథ్ నియోజకవర్గంలో చాలా మంది మారుమూల గ్రామాల్లో గిరిజనేతరులు (ఎస్సీ, బీసీ,మైనార్టీ) రైతులు పోడు వ్యవసాయం చాలా సంవత్సరాలుగా చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయం చేయకుండా అటవీ అధికారులు అడ్డుపడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పోడు వ్యవసాయంపై ఆటంకాలు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు, అటవీ అధికారులకు విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలో పోడు భూముల సర్వే చేయడం జరిగిందని అందులో గిరిజనేతరుల భూములు కూడా ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇప్పించేలా చూడాలని మంత్రులు సీతక్క, కొండా సురేఖను కోరారు. ఈ విషయంలో గిరిజనేతరులను పోడు వ్యవసాయ విషయంలో ఇబ్బందులు పెట్టవద్దని అధికారులను ఆదేశిస్తామని మంత్రులు చెప్పినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# నకిలీ విత్తనాలు సీజ్

ఇచ్చోడ, మే 24 : ఇస్లాంనగర్‌కు చెందిన జాదవ్ గజానంద్ ఇంట్లో టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు తనిఖీలు నిర్వహించి తొమ్మిది నకిలీ విత్తన ప్యాకెట్లను సీజ్ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ తెలిపారు. జాదవ్ గజానంద్‌ను విచారించగా కోకస్మన్నూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి 18 ప్యాకెట్లను విక్రయించినట్లు తెలిపారు. అనంతరం కోకస్మన్నూర్ గ్రామంలో విచారణ చేయగా కాండ్లి శివకుమార్ వద్ద ఆరు ప్యాకెట్లు, లోట్టపెల్లి రవీందర్ వద్ద 12 ప్యాకెట్లు లభించాయని తెలిపారు. ముక్రా(బీ) గ్రామానికి చెందిన అడావ్ రవికాంత్ మహారాష్ట్ర నుంచి వీటిని తెచ్చి జాదవ్ గజానంద్ ద్వారా అమాయక రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రవికాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఇచ్చోడ ఏవో రమేశ్, టాస్క్ ఫోర్స్ టీమ్ సిబ్బంది ఉన్నారు.




సీజ్ చేసిన నకిలీ విత్తనాల ప్యాకెట్లు